సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం । 7 । ఫిబ్రవరి । 2025



సోమశిలలో 65.678 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో గురువారానికి 65.678 టీఎంసీలు ఉన్నాయి. ఎగువ నుంచి 130 9 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, దిగువ కాలువలకు 4000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.87,280
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,904
3 శాతం జీఎస్టీతో	రూ.8,141
సవర (8 గ్రా)	రూ.65,128

గరిష్టం/కనిష్టం
33.1 /23.1

వాతావరణం

జిల్లాలో శుక్రవారం వాతావరణం సాధారంగా ఉంటుందని ఆశాఖాధికారులు తెలిజేశారు. గాలిలో తేమ 51 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

పకడ్బందీగా జనరల్ ప్రాక్టికల్స్ నిర్వహించాలి



మాట్లాడుతున్న ఆర్ఐఓ శ్రీనివాసులు

నెల్లూరు (టౌన్): ఇంటర్ విద్యార్థులకు సంబంధించి ఈ నెల 10వ తేదీ నుంచి ప్రారంభం కానున్న జనరల్ ప్రాక్టికల్స్‌ను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్ఐఓ శ్రీనివాసులు తెలిపారు. గురువారం స్థానిక డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో జిల్లాలోని ఆయా జూనియర్ కళాశాలల ఫిజిక్స్, బాటని అధ్యాపకులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. మాట్లాడు తూ పరీక్షల సక్రమ నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. బోర్డు నిబంధనల మేర కు ప్రాక్టికల్స్‌ను నిర్వహించాలన్నారు. జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు దీన్‌దయాళ్ పరీక్ష పత్రాల డౌన్‌లోడింగ్, పరీక్షల నిర్వహణ, మా ర్కుల నమోదు తదితర అంశాలపై వివరించా రు. ఈ కార్యక్రమంలో డీఈసీ సభ్యులు వేణు గోపాల్, కొండయ్య, సబ్జెక్ట్ నిపుణులు గౌస్‌బా షా, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యానికి నులిపురుగుల నివారణే మార్గం

- కలెక్టర్ ఆనంద్



పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్, ఇతర అధికారులు

నెల్లూరురూరల్: పిల్లల ఆరోగ్యం మెరుగుపడి వారి మానసిక, శారీరక అభివృద్ధికి నులి పురుగుల నిర్మూలనే ముఖ్యమని కలెక్టర్ ఓ ఆనంద్ తెలిపారు. ఈ నెల 10న జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్‌లో కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అంగన్‌వాడీలు, ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లోని 19 ఏళ్ల లోపు పిల్లలందరికీ ఈ మాత్రలు సోమవారం అందించాలన్నారు. ఆ రోజున విద్యార్థులందరూ కచ్చితంగా పాఠశాలకు హాజరయ్యే విధంగా ముందుగానే తెలియజేయాలన్నారు. ఉపాధ్యాయులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు తల్లిదండ్రులకు అవగాహన కలిగించాలన్నారు. ఈ అల్బెండజోల్ మాత్రలు తీసుకోవడంతో పిల్లల్లో రక్తహీనత తగ్గి, ఆకలి పెరిగి, పోషకాలు మెరుగుపడి చదువులపై ఆసక్తి కలుగుతుందన్నారు. 'ఆరోగ్యవంతులైన పిల్లల కోసం నులి పురుగులను నులిమేద్దాం' పోస్టర్‌ను కలెక్టర్ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సమావేశంలో డీఎంహెచ్ఓ సుజాత, డీసీహెచ్ఎస్ రమేష్‌నాథ్, డీఈఓ బాలాజీరావు, సమగ్ర శిక్ష ఏపీఓ వెంకట సుబ్బయ్య, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి పరిమళ, ఐసీడీఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఒకేషనల్ ప్రాక్టికల్స్‌కు 37 మంది గైర్హాజరు

నెల్లూరు (టౌన్): జిల్లా వ్యాప్తంగా గురువారం జరిగిన ఇంటర్ ఒకేషనల్ ప్రాక్టికల్స్‌కు 37 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన ప్రాక్టికల్స్‌కు 283 మందికి 263 మంది హాజరు కాగా, 20 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నుంచి జరిగిన ప్రాక్టికల్స్‌కు 277 మందికి 260 మంది హాజరయ్యారు. 17 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

ఏకలవ్య స్కూల్లో అడ్మిషన్లకు దరఖాస్తుల స్వీకరణ

కొడవలూరు: మండలంలోని చంద్రశేఖరపురం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో 6వ తరగతిలో చేరికకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ టి.విష్ణుప్రియ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన బాలబాలికలే అర్హులన్నారు. పాఠశాలలోని 60 సీట్లకు 30 బాలురకు, 30 బాలికలకు కేటాయించామన్నారు. ఈ నెల 19వ తేదీలోగా దరఖాస్తులు అందజేయాలన్నారు. 5వ తరగతి విద్యార్హతతోపాటు ఈ ఏడాది మార్చి 31 నాటికి 10 నుంచి 13 ఏళ్ల వయస్సు ఉండాలని చెప్పారు. దరఖాస్తు చేసే విద్యార్థి ఆధార్‌తోపాటు తల్లిదండ్రుల ఆధార్, విద్యార్థి సంతకంతో కూడిన పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలన్నారు. లేదంటే నేరుగా ఏకలవ్య స్కూల్లో 9490957261, 955347050 నంబర్లలో సంప్రదించవచ్చని సూచించారు. విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్‌లో రాత పరీక్ష నిర్వహించి సీటు కేటాయించడం జరుగుతుందని స్పష్టం చేశారు.

నయా నయీంలు

కూటమి ప్రభుత్వంలో శాసన సభ్యుల కంటే.. షాడో ఎమ్మెల్యేలే అధికార వ్యవస్థలను శాసిస్తున్నారు. ఎమ్మెల్యేలు తెర వెనుక నుంచి షాడోలతో దోపిడీకి పాల్పడుతున్నారనదే జగద్విదితమే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మరుసటి రోజు నుంచే ఇసుక, మట్టి, గ్రావెల్‌తో ప్రారంభించిన దోపిడీ.. రేషన్ బియ్యం అక్రమ రవాణా నుంచి అగ్రిగోల్డ్ సంపద వరకు అప్రతిహతంగా కొనసాగుతోంది. మద్యం బెల్టు షాపులు, జూద క్రీడలతో జనం సంపదను కాజేస్తున్నారు. కాంట్రాక్ట్ వర్కుల నుంచి ఉద్యోగులకు పోస్టింగ్‌ల వరకు ముడుపులు ముట్టజెప్పి షాడోలు ఆమోద ముద్ర వేస్తేనే పనులు జరుగుతాయి. పంచాయతీ స్థాయి అధికారి నుంచి జిల్లా స్థాయి అధికారి వరకు వారిపై కర్ర పెత్తనం చేస్తూ అడ్డగోలుగా పనులు చేయించుకుంటున్నారు. ఇక ప్రతిపక్షమైనా.. స్వపక్షమైనా ప్రశ్నించే వారిపై దాడులు చేయడం, వారిపైనే కేసులు పెట్టడం ఆనవాయితీగా మారింది.

- దొరికిన కాడికి సంపద దోపిడీ
- ఇసుక, గ్రావెల్, అక్రమ రవాణాతో రూ.కోట్లు కొల్లగొడుతున్న వైనం
- ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు, దాడులు
- పంచాయతీ అధికారి నుంచి జిల్లా అధికారిపై వరకు కర్ర పెత్తనం
- జిల్లాలో మితిమీరిన రెడ్‌బుక్ రాజ్యాంగం



సాక్షి టాస్క్‌ఫోర్స్: జిల్లాలో ఎమ్మెల్యేలు, షాడో ఎమ్మెల్యేలు నయా నయీంలుగా అవతరించారు. ఎమ్మెల్యేల కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులే షాడోలుగా వ్యవహరిస్తూ ప్రభుత్వ వ్యవస్థలను తమ గుప్పెట్లో పెట్టుకుని శాసిస్తూ అవినీతి, అక్రమాలు, దందాల్లో మునిగి తేలిపోతున్నారు. తమ చేతికి నేరుగా మట్టి అంటుకోకుండా వ్యవహారాలు చక్కబెడుతున్నారు. కొందరు ఎమ్మెల్యేలు అయితే మండలానికో షాడోను నియమించి అందిన కాడికి దోచుకుంటున్నారు. మరి కొందరు ప్రధాన అనుచరులను నమ్ముకుని జేబులు నింపుకుంటున్నారు. ఒక వేళ ఆరోపణలు వస్తే తనకు తెలియకుండా చేశారని సాకు చూపించేలా వ్యవహరిస్తున్నారు.

ప్రజాసంపద దోపిడీయే పరమావధిగా..

ఎమ్మెల్యేలు, షాడో ఎమ్మెల్యేలు ప్రజల సంక్షేమాన్ని, నియోజకవర్గాల్లో అభివృద్ధిని గాలికి వదిలేశారు. ప్రతి నియోజకవర్గంలో ఇసుక మట్టి, గ్రావెల్ అక్రమ రవాణాతో రూ.కోట్ల జేబుల్లో నింపుకుంటున్నారు. రియల్ ఎస్టేట్ వెంచర్ల నుంచి కాంట్రాక్టర్ల వరకు వాటాలు దండుకుంటున్నారు. మద్యం బెల్టు షాపులు, పేకాట, డైమండ్ డబ్బా వంటి జూద క్రీడలను ప్రోత్సహిస్తూ ప్రజల సొమ్ము కాజేస్తున్నారు. ఉపాధి, డ్వాక్రా శాఖలతోపాటు అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న చిరు ఉద్యోగులను తొలగించి.. తమ కార్యకర్తలను నియమించుకుని నెలవారీ మామూళ్లు, ఇక ఉద్యోగుల బదిలీల విషయంలో పెద్ద మొత్తంలో దండుకుంటున్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా నుంచి అగ్రిగోల్డ్ ఆస్తుల్లో సంపద వరకు దోచుకుంటున్నారు.

కుటుంబ సభ్యులు, ప్రధాన అనుచరులదే షాడోలు

నగరపాలక సంస్థ పరిధిలోని ఒక నియోజకవర్గంలో ముగ్గురు వ్యక్తులు షాడో ఎమ్మెల్యేలుగా వ్యవహరిస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధి కుటుంబ సభ్యులతోపాటు వారి కీలక అనుచరులు ఇరువురు షాడోలుగా వ్యవహరిస్తూ.. అన్నీ తామై చక్కబెట్టుతున్నారు. ప్రధానంగా కుటుంబ సభ్యల్లో ఒకరు తమ సామాజిక వర్గంపై ఫోకస్ చేశారు. ఆ కార్యక్రమాల్లో ఆమె కీలకంగా వ్యవహరిస్తున్నారు. మెప్మా శాఖలో ఆర్‌పీల ఎంపిక నుంచి అన్ని విషయాల్లో తలదూర్చుతున్నారు. తమకు అనుకూలమైన వారికి పోస్టింగ్‌లు ఇప్పిస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న వారిని తొలగించి వారి కుటుంబాలను వీధిన పడేస్తున్నారు. మరో ఇద్దరు బ్రదర్స్ షాడోలుగా వ్యహరిస్తున్నారు. అధికారులు బదిలీల నుంచి కార్పొరేషన్, రాజకీయ వ్యవహారాలు ఆయన వెన్నంటే ఉన్న వ్యక్తి చక్కబెడుతున్నాడు. మరొకరు నామినేటెడ్ పోస్టు ఉండడంతో ఆ శాఖలో వచ్చే అక్రమార్జన తానే ఆర్జిస్తున్నాడు.

- మరో నియోజకవర్గంలో ప్రజాప్రతినిధి సోదరుడే షాడోగా వ్యవహరిస్తున్నారు. ఆయన ప్రజాప్రతినిధి కాకున్నా.. ప్రజాప్రతినిధి హోదాలో అన్ని కార్యక్రమాలు అధికారికం గానే చక్కబెడుతున్నారు. ఉద్యోగుల బదిలీల నుంచి కాంట్రాక్ట్‌ల బిల్లుల వరకు స్వయంగా చూసుకోవడం గమనార్హం.

అంతా క్లాస్ మేట్‌దే..

జిల్లాలో మరో మెట్ట నియోజకవర్గంలో ఎమ్మెల్యే క్లాస్ మేట్ ప్రస్తుతం షాడోగా వ్యవహరిస్తున్నాడు. ఎమ్మెల్యేగా గెలిచిన సమయంలో అవినీతి దూరంగా ఉంటానని ప్రగల్భాలు పలికాడు. నెలకే నాలుక మడతేసి తూచ్ అనేశాడు. ఉద్యోగులు బదిలీల నుంచి అన్ని వ్యవహారాల్లో తన నీడలా ఉండే పీఏతో అన్ని పనులు చక్క బెట్టేస్తున్నాడు. అప్పట్లో పెద్ద వివాదం రేగడంతో ఆయన్ను పక్కన పెట్టి జిల్లా కేంద్ర కార్యాలయానికి పరిమితం చేశారు. ప్రస్తుతం బాల్య మిత్రుడు, క్లాస్‌మేట్‌ని తెరపైకి తెచ్చి.. అగ్రిగోల్డ్ భూముల్లో జామాయిల్ అక్రమ సంపదను కొల్లగొట్టుతున్నారు. మద్యం వ్యవహారాల నుంచి తెల్లరాయి మైనింగ్ వ్యవహారాలు చూస్తున్నారు. తాజాగా క్వార్ట్జ్ మెటల్ యజమానులు పిలిపించి నెలకు రూ.కోటి డిమాండ్ చేశారంటా. జాతీయ రహదారులు కాంట్రాక్టర్లను బెదిరించి వసూళ్లు చేసుకున్నారన్న ఆరోపణలున్నాయి.

మెట్టలో వారిదే హవా

జిల్లా సరిహద్దు ప్రాంతంలో ఉన్న ఓ మెట్ట నియోజకవర్గంలో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు బయట వ్యవహారాలు చక్క బెడుతుంటే.. మరో ఇద్దరు ముఖ్య అనుచరులు ఎమ్మెల్యే కుడి, ఎడమ షాడోలుగా అన్ని చక్క బెడుతున్నారు. గ్రావెల్, ఇసుక మాఫియాలను నడిపిస్తున్నారు. ఉద్యోగులు, అధికారులు బదిలీల నుంచి ప్రైవేట్ సంస్థ భూముల్లో కర్రస్కామ్. ప్రైవేట్ భూముల్లో జరిగే వివాదాల్లో తలదూర్చి కలప అక్రమ రవాణా, రేషన్ మాఫియా అక్రమార్జనలో తలమునకలయ్యారు. తమకు వ్యతిరేకంగా వ్యవహరించే వారిపై ఏకంగా దాడులకు పురిగొల్లుతున్న పరిస్థితి. ప్రతిపక్ష నేతలపై కేసులు పెట్టి జైలు పాల్జేసిన చరిత్ర ఎమ్మెల్యే, షాడోలదే.

ఇక్కడ మండలానికొకరు..

జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న డెల్టా నియోజకవర్గంలో మండలానికి ఓ షాడోను పెట్టారు. మండలంలో ఏ పని కావాలన్నా షాడో ఎమ్మెల్యేల కనుసన్నల్లో జరగాల్సిందే. ఇసుక దోపిడీ నుంచి గ్రావెల్ అక్రమ రవాణా అంతా వారి కనుసన్నల్లో జరుగుతున్నాయి. పేకాట శిబిరాలు, చికెన్ వేస్ట్ మాఫియా, లే అవుట్ యజమానులు వద్ద వసూళ్లు, కాంట్రాక్టర్ల వద్ద వసూళ్లు అన్ని వ్యవహారాలు షాడోలే చక్క బెడుతున్నారు.

ఇక్కడ వ్యాపారే షాడో

జిల్లాలో కొత్తగా చేరిన ఓ నియోజకవర్గంలో ప్రజాప్రతినిధికి అత్యంత సన్నిహితుడిగా ఉండే ఓ వాణిజ్య పంట వ్యాపారి షాడోగా వ్యవహరిస్తున్నాడు. అవినీతి, అక్రమాలకు, గ్రామ స్థాయి నుంచి డివిజన్ స్థాయి అధికారులు బదిలీలు, నియామకాలు, కాంట్రాక్ట్ పనుల్లో కమీషన్లు, లేఅవుట్లకు ముడుపులు, చివరికి దివ్యాంగులకు ఇచ్చే సదరం సర్టిఫికెట్లలో కూడా కమీషన్లు ఇవ్వాలని హుకుం జారీ చేశారు. రేషన్ డీలర్లను ఎంపిక చేయడం దగ్గర నుంచి బియ్యాన్ని ఎవరికి అమ్మాలి. ఎవరు కొనుగోలు చేయాలనే వ్యవహారాలన్నీ ఆయనే పర్యవేక్షిస్తున్నారు. రేషన్ డీలర్ల దగ్గర నుంచి బియ్యం కొనుగోలు చేయడంతో పాటు, వాటిని బ్లాక్ మార్కెట్‌కు తరలించేందుకు ప్రత్యేకంగా ఓ బృందం ఆయన కనుసన్నల్లో పని చేస్తోంది. ఏకంగా సివిల్ సప్లయిస్ గోడౌన్ నుంచే నేరుగా బ్లాక్ మార్కెట్‌కు బియ్యం తరలించే స్థాయికి ఎదిగిపోయారు. ఉచిత ఇసుక మాటును పెద్ద దోపిడీనే జరుగుతోంది. గత ప్రభుత్వంలో రెండు, మూడేళ్ల క్రితం అన్ని అనుమతులు తీసుకుని వేసిన లేఅవుట్లకు ముడుపులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. మున్సిపల్ అధికారులను పంపించి లేఅవుట్లో హద్దు రాళ్లను తొలగించే చర్యలకు పూనుకున్నారు.

ఎమ్మెల్యే.. షాడో ఆయనే...

జిల్లాలో పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న నియోజకవర్గంలో ఆ ప్రజాప్రతినిధి మాత్రం తన నీడను కూడా నమ్మకుండా కుటుంబ సభ్యులనే షాడోలా ఉంచుకున్నాడు. ఇసుక, మట్టి, గ్రావెల్ అక్రమ తరలింపు, లేఅవుట్ల యజమానుల వద్ద ముడుపులు, మద్యం షాపుల వద్ద నెలవారీ మామూళ్లు పొందడం వంటి వరకు ఆయనే సర్వం చూసుకుంటున్నాడు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు మాట్లాడితే అక్రమ కేసులు పెట్టిస్తున్నారు. ఈ షాడో ఎమ్మెల్యే మండలానికి ఒక ఏజెంట్‌ను పెట్టుకుని ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తున్నాడు. అధికారులు, ఉద్యోగుల బదిలీల్లో నగదు మార్పిడి అంతా తన కనుసన్నల్లోనే జరుగుతోంది. నియోజకవర్గంలో ఎలాంటి సెటిల్‌మెంట్లు చేయాలన్నా.. సదరు ఎమ్మెల్యే వద్దకు డబ్బు సంచులు తీసుకుని వెళ్తే పార్టీలతో కూడా పనిలేకుండా పని జరిగిపోతుందనే ప్రచారం ఉంది.

అగ్రిగోల్డ్ భూముల్లో సీఐడీ పరిశీలన

వరికుంటపాడు: మండలంలోని కనియంపాడు, భాస్కరపురం గ్రామాల్లో ఉన్న అగ్రిగోల్డ్ భూములను గురువారం నెల్లూరు సీఐడీ అధికారి సీఐ వెంకటేశ్వర్లు స్థానిక రెవెన్యూ సిబ్బందితో కలిసి పరిశీలించారు. సీఐడీ అధికారి వీఆర్వో, సర్వేయర్లతో కలిసి అగ్రిగోల్డ్ భూముల సరిహద్దులపై ఆరా తీశారు. అనంతరం పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఎస్సైతో మాట్లాడారు. విలేకరులకు వివరాలతో మాట్లాడుతామని చెప్పినా.. ఏమీ మాట్లాడకుండానే వెళ్లిపోయారు. మండలంలోని అగ్రిగోల్డ్ భూముల్లోని రూ.కోట్ల విలువైన జామాయిల్ కర్రను టీడీపీ నేతలు కొల్లగొట్టుతున్నట్లు మీడియాల్లో కథనాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో సీఐడీ అధికారులు సదరు భూములను పరిశీలించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

వెట్టి కార్మికులను గుర్తించండి

- కలెక్టర్ ఆనంద్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు రూరల్: వెట్టిచాకిరి కార్మికులను గుర్తించడంలో అధికారులు ముఖ్య పాత్ర పోషించాలని కలెక్టర్ ఓ ఆనంద్ తెలిపారు. ఈ నెల 9న వెట్టిచాకిరి నిర్మూలన దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి అధికారులకు వెట్టిచాకిరి నిర్మూలన చట్టంపై అవగాహన కోసం సాంఘిక సంక్షేమశాఖ, ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ ప్రతినిధులు శ్యామ్, గంటా ప్రియాంక ఆధ్వర్యంలో గురువారం వర్క్‌షాప్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమలు ఎక్కువగా ఉన్నాయని, కనీస వేతనం చెల్లించకపోవడమే కాకుండా శారీరక శ్రమను దోచుకోవడం, ఆర్థిక స్వేచ్ఛను హరించడం కూడా వెట్టిచాకిరి కిందకు వస్తాయన్నారు. వెట్టి చాకిరి వ్యవస్థలోని కార్మికులను గుర్తించడంలో అధికారులు ముఖ్య పాత్ర పోషించాలన్నారు. తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వెట్టిచాకిరి కార్మికులను గుర్తించి వారికి పునరావాసం కల్పించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. చట్ట ప్రకారం సంబంధిత యాజమాన్యాలపై చర్యలు ఉంటాయన్నారు. ఈ వర్క్‌షాప్‌లో అసోసియేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సంస్థ ప్రతినిధి షేక్ బషీర్, సోషల్ వెల్ఫేర్ డీడీ శోభారాణి, కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ, ఆర్డీఓలు అనూష, పావని, వంశీకృష్ణ, డిప్యూటీ లేబర్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డీఎంహెచ్ఓ సుజాత, డీఆర్‌డీఏ, హౌసింగ్ పీడీలు నాగరాజుకుమారి, వేణుగోపాల్ పాల్గొన్నారు.

రైతుకు మద్దతు ధర కల్పించేందుకు చర్యలు

- రైతులు సూచించిన సమస్యల పరిష్కారానికి కృషి
- ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పక్కాగా ఏర్పాట్లు
- జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్



రైతు సంఘాల నేతలతో మాట్లాడుతున్న జేసీ

నెల్లూరు రూరల్: జిల్లాలో వరి పంట కోతలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రతి రైతుకు కూడా మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వ పరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ చెప్పారు. గురువారం ఉదయం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోళ్లపై రైతు సంఘాల నాయకులు, రైతులతో జేసీ సమావేశం నిర్వహించారు. రైతు సంఘాల నాయకులు పలు సమస్యలను జేసీ దృష్టికి తీసుకొచ్చారు. ప్రధానంగా రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కల్పించాలని, రైతుసేవా కేంద్రాల్లోనే తేమ శాతం నిర్ధారించి ఆ ధాన్యాన్ని మిల్లర్లు తీసుకునేలా చూడాలని, లోడింగ్ సమయంలో ఎక్కువ సేపు వేచి ఉండకుండా చూడాలని కోరారు. ధాన్యం డబ్బులను కూడా ప్రభుత్వం ఆలస్యం లేకుండా వెంటనే చెల్లించేలా చర్యలు చేపట్టాలని కోరారు. మిల్లర్లు, దళారులు ధాన్యం ధరలు తగ్గించి కొనుగోలు చేసే చర్యలకు అడ్డుకట్ట వేయాలని కోరారు. కోతల సమయంలో గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలని విన్నవించారు. ధాన్యాన్ని బెట్టుకునేందుకు మొబైల్ డ్రైయర్లను సమకూరిస్తే రైతుకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రైతులు సూచించిన అన్ని సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతామన్నారు. ప్రతి గింజను కూడా మద్దతు ధర కంటే తక్కువ కాకుండా కొనుగోలు చేయించడమే లక్ష్యంగా అధికార యంత్రాంగం పని చేస్తుందన్నారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అధికారులు పరిశీలించి ధాన్యం ధరలను పర్యవేక్షిస్తారన్నారు. గన్నీ బ్యాగులు సరిపడా అందుబాటులో ఉంచుతామన్నారు. జిల్లాలో ఏ ఒక్క రైతు కూడా నష్టపోకుండా మద్దతు ధరకే ధాన్యం అమ్ముకునేలా ప్రనుత్వ మార్గదర్శకాల మేరకు అన్న చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, సివిల్ సప్లయిస్ డీఎం వెంకటరమణ, రైతు సంఘ నాయకులు కోటిరెడ్డి, మల్లారెడ్డి, రాధాకృష్ణమ నాయుడు, శ్రీనివాసులు, వెంకటరమణయ్య, వెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అక్రమార్కులకు బాసట

తిలాపాపం తలా పిడికెడు చందంగా ఉపాధి హామీ పథకం పనుల్లో కూటమి నేతల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది.. ఉన్నతాధికారుల వరకు అవినీతికి పాల్పడ్డారు. ఈ వ్యవహారంపై పెద్ద ఎత్తున ఆరోపణలు రావడంతో రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. రికవరీలతోపాటు అవినీతి పరులను సస్పెండ్ చేయాలని ఆదేశాలిచ్చినా.. జిల్లా స్థాయి అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. కింది స్థాయి సిబ్బందిని సస్పెండ్ చేసినప్పటికీ వారితోనే విధులు నిర్వర్తిస్తున్న పరిస్థితి అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది. ఇక మండల స్థాయి అధికారులపై చర్యలకు సంబంధించి ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

- ఉత్తుత్తి రికవరీలకు ఆదేశం
- పేరుకే సిబ్బంది సస్పెన్షన్
- సిబ్బంది కొరతతో కొనసాగిస్తున్న వైనం
- కూటమి నేతలు, అధికారుల డ్రామాలు

నెల్లూరు (పొగతోట): ఉపాధి హామీ పథకాన్ని కూటమి నేతలు తమ ఆదాయ పథకంగా మార్చుకున్నారు. కూటమి నేతల అవినీతి ఆటలకు అధికారులు తానతందానా అంటున్నారు. పేద ప్రజలకు ఉపాధి కల్పించేందుకు అమలు చేస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అభాసు పాలవుతుంది. ఉపాధి పనుల్లో రూ.లక్షలు నిధులు బొక్కేసిన సిబ్బందిపై ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. సిబ్బంది కొరత అంటూ అవినీతి పరులకు అధికారులు అండగా నిలుస్తున్నారు.

జిల్లాలో రాపూరు, సైదాపురం, కలిగిరి, కొండాపురం, వింజమూరు తదితర మండలాల్లో సోషల్ ఆడిట్‌లో ఒక్కొక్క సిబ్బంది రూ.లక్షలు అవినీతికి పాల్పడ్డారంటూ తేల్చారు. ఉత్తుత్తి రికవరీలు, సస్పెన్షన్లతో అధికారులు డ్రామాలు ఆడుతున్నారు. కేసుల నమోదు చేయాలని ఆదేశాలిచ్చినా.. ఆ ఊసే లేదు. రాపూరు మండలంలో రూ.1.30 కోట్ల అవినీతి జరిగినట్లు సోషల్ ఆడిట్‌లో నిర్ధారించారు. సోషల్ ఆడిట్ పూర్తయి నెలల కాలం గడుస్తున్నా.. ఇంత వరకు చర్యలు శూన్యం. అధికారులు మాత్రం సోషల్ ఆడిట్ జరిగిన రోజునే సిబ్బందిని సస్పెండ్ చేస్తున్నామంటూ ప్రకటనలిచ్చారు. కొంత కాలం సస్పెన్షన్‌కు సంబంధించిన ఫైల్ జిల్లా కలెక్టర్ వద్ద పెండింగ్ ఉందంటూ డ్వామా అధికారులు రకరకాల కారణాలు చెప్పి కాలయాపన చేస్తున్నారు. కొండాపురం, వింజమూరు తదితర మండలాల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. కలువాయి మండలానికి సంబంధించిన సిబ్బందిని మాత్రమే సస్పెండ్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేశారు.



రాపూరు సిబ్బందికి కూటమి నేత అభయం

రాపూరు మండలంలో అవినీతికి పాల్పడిన ఉపాధి అవినీతి పరులు జిల్లాకు చెందిన కూటమి నేత అభయమిస్తున్నట్లు తెలుస్తోంది. ఆయన ఆదేశాల మేరకే రాపూరు సిబ్బందిని తొలగించకుండా కొనసాగిస్తున్నారని సమాచారం. ప్రస్తుతం రికవరీకి ఆదేశించిన మొత్తాన్ని.. తాజాగా జరిగే పనుల్లో దోచుకుని చెల్లిస్తున్నట్లు సమాచారం. రాపూరు మండలంలో రూ.1.30 కోట్లు, సైదాపురంలో రూ.58 లక్షలు, కొండాపురంలో రూ.70 లక్షలు, కలిగిరి రూ.60 లక్షలు, వింజమూరు రూ.20 లక్షల మేర సామాజిక తనిఖీల్లో సిబ్బందిపై రికవరీలు విధించారు. రాపూరు మండలం కంభాలపల్లి పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్‌ను రికవరీ ఉందని సస్పెండ్ చేశారు. పై స్థాయి సిబ్బందిపై రూ.లక్షల రికవరీలు ఉన్నా వారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదంటూ సదరు ఎఫ్ఏ ఆవేదన వ్యక్తం చేశారు. క్లస్టర్ ఏపీడీ శంకర్ నారాయణ గతంలో సర్టిఫికెట్లలో పుట్టిన తేదీ మార్పులు చేశారని, దీనిపై విచారించి చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఉపాధి హామీ నిబంధనల ప్రకారం రూ.50 వేలకు పైగా రికవరీ ఉంటే సిబ్బందిని సస్పెండ్ చేయాల్సి ఉంది. అధికారులు నిబంధనలను తుంగలో తొక్కి రూ.లక్షలు అవినీతికి పాల్పడిన సిబ్బందికి అండగా నిలుస్తున్నారు.

సిబ్బంది కొరత ఉంది



ఉపాధి హామీ పనులకు సంబంధించి లక్ష్యాలను సాధించేలా చర్యలు చేపడుతున్నాం. నిత్యం లక్ష మంది కూలీలు పనులకు హాజరయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. సోషల్ ఆడిట్‌లో రికవరీలు ఉన్న సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం సిబ్బంది కొరత అధికంగా ఉంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అవినీతికి పాల్పడిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– గంగా భవాని, డ్వామా పీడీ

సంకల్పం ముందు

ఓడిన వైకల్యం



వీల్‌చైర్ క్రికెట్ క్రీడాకారులతో పెంచలయ్య

అతడి సంకల్పం ముందు వైకల్యం ఓడింది. మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగుతూ ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తున్నాడు. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతున్నాడు. జిల్లా నుంచి ఏపీ వీల్‌చైర్ క్రికెట్ టీమ్‌లో కొనసాగుతున్నాడు. అతడికి క్రికెట్‌లోనే కాదు బాస్కెట్‌బాల్లోనూ ప్రవేశం ఉంది. జాతీయ స్థాయిలోనూ ఆడాడు.

- వీర్‌చైర్ క్రికెట్లో రాణిస్తున్న పెంచలయ్య
- జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

పొదలకూరు: మండలంలోని మొగళ్లూరు గ్రామానికి చెందిన రామయ్య, అంకమ్మల కుమారుడు పెంచలయ్యకు పుట్టుకతోనే అంగవైకల్యం ఉంది. పోలియో వల్ల రెండు కాళ్లు చచ్చుబడ్డాయి. 84 శాతం అంగవైకల్యం ఉన్నా తల్లిదండ్రుల సహకారంతో ఎంతో కష్టపడి ఎంఏ, బీఈడీ చదివాడు. పెంచలయ్యకు చిన్నతనం నుంచి క్రికెట్ అంటే ఎంతో ఇష్టం. దివ్యాంగులకు వీల్‌చైర్ క్రికెట్ ఉందని తెలుసుకుని సాధన చేయడం మొదలుపెట్టాడు. పట్టుదలతో ఆట నేర్చుకుని ఆంధ్రప్రదేశ్ టీమ్‌లో సభ్యుడిగా మారాడు. వివిధ రాష్ట్రాలకు చెందిన టీమ్‌లపై విజయం సాధించిన ఏపీ బృందంలో పెంచలయ్య సభ్యుడిగా ఉన్నాడు. 2018లో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వీల్‌చైర్ క్రికెట్ టీమ్ ఛత్తీస్‌గఢ్ టీమ్‌తో తలపడింది. ఇందులోనూ ఆడాడు. 2022లో తానా (తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా) విశాఖలో నిర్వహించిన పోటీల్లో పెంచలయ్య ప్రతిభ చూపాడు.

ఏడు సంవత్సరాల్లో..

పేదరికంలో పుట్టిన పెంచలయ్య ఎంతో కష్టపడి వీల్‌చైర్ క్రికెట్‌లో రాణిస్తున్నాడు. ఆడటం ప్రారంభించిన ఏడు సంవత్సరాల్లో తమిళనాడు, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల్లో పోటీల్లో పాల్గొని గుర్తింపు తెచ్చుకున్నాడు. ఈనెల 5వ తేదీన మధ్యప్రదేశ్ రాష్ట్రం గ్వాలియర్‌లో ప్రారంభమైన జాతీయ వీల్‌చైర్ క్రికెట్ పోటీల్లో ఏపీ జట్టు తరఫున పాల్గొంటున్నాడు. వీల్‌చైర్ క్రికెట్‌లో దివ్యాంగులకు శిక్షణ ఇచ్చి వారిలో స్ఫూర్తి నింపాలనే ఆలోచనలో ఉన్నాడు.



ట్రోఫీతో పెంచలయ్య (ఫైల్)

ఉద్యోగం సాధిస్తా

"క్రికెట్‌పై మక్కువతోనే నేను వీల్‌చైర్ క్రికెట్‌లో రాణిస్తున్నాను. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలనే ఆశయంతో ఏపీ వీల్‌చైర్ క్రికెట్ టీమ్‌లో కొనసాగుతున్నాను. సంకల్పం ఉంటే వైకల్యం అడ్డురాదు. కృషి, పట్టుదల మెండుగా ఉండాలి."

– కంబాపు పెంచలయ్య, వీల్‌చైర్ క్రికెటర్

విధి వెక్కిరించినా..

జీవితంలో గెలిచి..

కొందరు చిన్నపాటి అపజయాన్ని కూడా తట్టుకోలేరు. ఇంతటితో జీవితం ముగిసిందన్నట్టుగా క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకుంటుంటారు. ఎంత కష్టమొచ్చినా పోరాడి జీవితంలో ముందుకెళ్లేవారు కొందరుంటారు. ఈ కోవలోకి వస్తాడు నాగరాజు. ఇతడికి పుట్టుకతోనే మూగ, చెవుడు ఉంది. మరోవైపు పేదరికం.. అయినా మనోధైర్యం కోల్పోలేదు. చిన్నతనంలో సరదాగా బొమ్మలు గీయడం నేర్చుకున్నాడు. నేడు అద్భుతమైన చిత్రాలకు కేరాఫ్‌గా నిలిచాడు.

- అతడికి పుట్టుకతోనే మూగ, చెవుడు
- సరదాగా బొమ్మలు గీయడాన్ని ప్రారంభించి..
- నేడు కుంచె కదిపితే అద్భుతాలే..
- వేలసంఖ్యలో చిత్రాలు వేసిన నాగరాజు



ఆర్ట్ పూర్తయ్యాక నాగరాజు ఆనందం

నెల్లూరు సిటీ: జీవితం కొందరికి పూలపాన్పు.. మరికొందరికి ముళ్లబాట.. విధి వెక్కిరించినా.. కుంగిపోకుండా పట్టుదలతో తమలో దాగి ఉన్న నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ ముందుకు సాగేవారు అరుదుగా ఉంటారు. అనుకున్నది సాధించి.. ప్రతిభకు పేదరికం, మరేదీ అడ్డుకాదని నిరూపిస్తుంటారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని సూళ్లూరుపేట మావిళ్లపాడు ప్రాంతానికి చెందిన పాల వెంకటస్వామి, ఆదెమ్మ దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. వారిలో చిన్నకుమారుడు నాగరాజుకు పుట్టుకతోనే మూగ, చెవుడు ఉంది. అతను స్వగ్రామంలోనే 5వ తరగతి వరకు చదివాడు. వివిధ కారణాలతో ఆ తర్వాత చదువును కొనసాగించలేకపోయాడు. దీంతో సరదాగా బొమ్మలు గీయడం నేర్చుకున్నాడు. కాలక్రమంలో దానినే వృత్తిగా మార్చుకున్నాడు. తండ్రి వెంకటస్వామి పది సంవత్సరాల క్రితం మృతిచెందాడు. కుటుంబ పెద్ద లేకపోవడంతో నాగరాజు అన్న కూలి పనులకు వెళ్లాల్సి వచ్చింది. అయినా ఆర్థిక సమస్యలు తీరలేదు. ఈ నేపథ్యంలో నాగరాజు పెయింటింగ్‌లు వేయడం, బ్యానర్లు రూపొందించడం మొదలుపెట్టి కుటుంబానికి అండగా నిలిచాడు. ఏడేళ్ల క్రితం వివాహం చేసుకుని నెల్లూరులోని ఆదిత్య నగర్‌లో నివాసం ఉంటున్నాడు.

పని కల్పించే స్థాయికి..

15 సంవత్సరాల వయసు నుంచి ఆర్ట్స్ వేసే వృత్తిలో ఉన్న నాగరాజు నేడు పదిమందికి పని కల్పించే స్థాయికి ఎదిగాడు. పెద్ద పెద్ద దేవతా మూర్తుల చిత్రాలు వేయడంతో దిట్టగా పేరు పొందాడు. అతడికి ఎవరైనా ఆర్డర్లు ఇవ్వాలన్నా.. మాట్లాడాలన్నా.. పేపర్‌పై రాసి చూపిస్తే చాలు. అర్థం చేసుకుని అద్భుతమైన చిత్రాలను అందిస్తున్నాడు.



శ్రద్ధగా రంగులద్దుతూ..

ఆకట్టుకునేలా..

నాగరాజు ఎలాంటి చిత్రాన్నైనా ఎంతో నైపుణ్యంతో రూపొందిస్తాడు. ఫ్యామిలీ ఫొటోలు, దేవుళ్లు, సీనరీస్, హీరోలు, రాజకీయ నాయకుల చిత్రాలు వేస్తుంటాడు. ఇతర జిల్లాలకు చెందిన వారు కూడా అతడిని సంప్రదిస్తున్న పరిస్థితి ఉంది. ఇప్పటికే వేల సంఖ్యలో చిత్రాలు వేశాడు. అదేవిధంగా శ్రీసిటీలోని పలు కంపెనీల్లో కూడా ప్రత్యేక ఆర్ట్‌లు రూపొందించాడు.



తాను వేసిన ప్రత్యేక ఆర్ట్ వద్ద నాగరాజు

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య

కావలి: పట్టణంలోని ముసునూరుకు చెందిన పాటూరి రఘు (26) అనే యువకుడు తన భార్య పుట్టింటికి వెళ్లిందని మనస్తాపం చెంది ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై బాధిత తండ్రి శీనయ్య గురువారం ఫిర్యాదు చేసినట్లు కావలి రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్సై తిరుమలరెడ్డి చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

సైకిల్‌పై భారతదేశ యాత్ర



సైకిల్‌పై వెళ్తున్న యువకులు

మర్రిపాడు: రాజస్థాన్‌కు చెందిన ఇద్దరు యువకులు సైకిల్‌పై భారతదేశ యాత్రకు శ్రీకారం చుట్టారు. తమిళనాడు రాష్ట్రంలో యాత్రను ముగించి ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగిస్తున్నారు. గురువారం మర్రిపాడు మండలంలో యాత్రను నిర్వహించారు. ఇప్పటి వరకు 12 రాష్ట్రాల్లో తిరిగినట్లు తెలిపారు.

కోళ్ల ఫారాల్లో తనిఖీలు



పేడూరులో వివరాలు తెలుసుకుంటున్న అధికారి

నెల్లూరు(సెంట్రల్): కోళ్ల ఫారాల్లో తనిఖీలు చేస్తున్నట్లు జిల్లా పశువ్యాధి నిర్ధారణ ప్రయోగ శాఖ ఏడీ జె.చైతన్యకుమార్ తెలిపారు. గురువారం పలుచోట్ల తనిఖీలు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో వైరస్ కారణంగా కోళ్లు చనిపోతున్నట్లు తెలుస్తోందన్నారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలోని కోళ్ల ఫారాలను తనిఖీలు చేసి నిర్వాహకులకు సూచనలిస్తున్నామని వెల్లడించారు. కోళ్లకు అనారోగ్యం ఉన్నట్లు అనుమానం వస్తే తక్షణమే తమ డాక్టర్లకు తెలియజేయాలన్నారు. అనారోగ్యంతో అవి చనిపోతే బహిరంగ ప్రాంతాల్లో వేయకుండా, గుంతలు తీసి పూడ్చి పెట్టాలని సూచించామన్నారు.

ఆటోను ఢీకొట్టిన ట్రాక్టర్



ఘటనా స్థలంలో ఆటో



మహిళా కూలీ మృతదేహం

- మహిళా కూలీ మృతి
- ఏడుగురికి తీవ్రగాయాలు
- పొగమంచులో వెళ్తుండగా ప్రమాదం

కొండాపురం: మండలంలోని వెలిగండ్ల వద్ద కూలీలతో వెళ్తున్న ఆటోను ట్రాక్టర్ ఢీకొట్టిన ఘటనలో గరిమెనపెంటకు చెందిన దిల్‌కుషా (42) అనే మహిళా కూలీ మృతిచెందింది. ఏడుగురు కూలీలు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. వెలిగండ్ల ఫారెస్ట్‌లో మొక్కలకు పాదులు తీసేందుకు గరిమెనపెంట నుంచి 14 మంది కూలీలతో ఆటో గురువారం ఉదయం 6 గంటల సమయంలో బయలుదేరింది. బసిరెడ్డిపల్లి నుంచి ట్రాలీ ట్రాక్టర్ వెలిగండ్ల రోడ్డు ఎక్కేందుకు వస్తోంది. ఈ నేపథ్యంలో పొగమంచు కారణంగా ఆటో కనిపించకపోవడంతో ట్రాక్టర్ ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో ఎనిమిది మంది గాయపడ్డారు. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది క్షతగాత్రులను కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ దిల్‌కుషా మృతిచెందింది. మైదుకూరు లక్ష్మమ్మ అనే మహిళ కాలు విరిగి పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తరలించారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ బాధితులను పరామర్శించాడు. కలిగిరి సీఐ శ్రీనివాసరావు, కొండాపురం ఎస్సై వెంకట్రావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేశారు. మృతురాలికి 18, 20 సంవత్సరాల వయసున్న కుమారులున్నారు.

ఆత్మకూరులో గంజాయి బ్యాచ్ కలకలం



మాట్లాడుతున్న డీఎస్పీ వేణుగోపాల్, చిత్రంలో సీఐ, ఎస్సైలు

ఆత్మకూరు: కొందరు వ్యక్తులు గంజాయి సేవించి మత్తులో ఉండగా పోలీసులు పట్టుకున్నారు. ఆత్మకూరు డీఎస్పీ కె.వేణుగోపాల్ గురువారం ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో సీఐ గంగాధర్‌తో కలిసి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆత్మకూరు పట్టణం, ఏఎస్‌పేట మండలం హసనాపురం, నెల్లూరు రూరల్, కలిగిరి మండలం కాకుటూరు గ్రామాలకు చెందిన షేక్ సుభహాని, షేక్ చిన్నబాదుల్లా, పొన్నపురెడ్డి తరుణ్, షేక్ మౌలాలి, పల్లా మాలకొండారెడ్డిలు ఆత్మకూరు పంటవీధి శివారు పొలాల్లో పాడుబడిన ఇంటి వద్ద గంజాయి సేవించి మత్తులో ఉండగా పోలీసులు బుధవారం పట్టుకుని 5 గ్రాముల బరువైన 13 ప్యాకెట్ల గంజాయి, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిని విచారించగా ఏఎస్‌పేటకు చెందిన మీరామొహిద్దీన్ వద్ద గంజాయి కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. దీంతో అతడిని కూడా అరెస్ట్ చేసి 500 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కాగా మొత్తం గంజాయి, ఫోన్ల విలువ సుమారు రూ.లక్ష ఉంటుందన్నారు. గంజాయి బ్యాచ్‌ను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన సీఐ గంగాధర్, ఎస్సైలు షేక్ జిలానీ, ఎస్.సాయి ప్రసాద్, కె.శ్రీనివాసులురెడ్డి, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

విద్యాశాఖాధికారుల విచారణ

నెల్లూరు(టౌన్): నెల్లూరు నగరంలోని సంతపేట ప్రభుత్వ ఆదర్శ ఉన్నత పాఠశాలలో విద్యార్థినిపై లైంగికదాడి జరిగినట్లు పత్రికల్లో వార్తలు రావడంతో గురువారం జిల్లా విద్యాశాఖాధికారులు విచారణ చేపట్టారు. డీఈఓ బాలాజీరావు ఆదేశాల మేరకు కందుకూరు డిప్యూటీ డీఈఓ జానకిరామయ్య పాఠశాలకు వెళ్లి హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అయితే బడిలో బాలికపై లైంగికదాడి, అటెండర్‌కు దేహశుద్ధి ఘటనలు జరగలేదని మూకుమ్మడిగా ఉపాధ్యాయులు, హెచ్‌ఎం చెప్పినట్లు తెలిసింది. టీచర్లందరూ ఒకమాటపై ఉండి ఈ విషయాన్ని మరుగునపడేసినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే పత్రికల్లో వచ్చిన వార్తల ఆధారంగా సంతపేట పోలీసులు పాఠశాలకు వెళ్లి వివరాలు తెలుసుకున్నట్లు సమాచారం. బాలిక కుటుంబసభ్యులతో మాట్లాడగా వారు అలాంటి ఘటన జరగలేదని చెప్పినట్లు తెలిసింది.

మద్యం తాగేందుకు డబ్బులివ్వలేదని..

- తాతపై మనవడి దాడి
- చికిత్స పొందుతూ మృతి



కృష్ణమూర్తి మృతదేహం

నెల్లూరు(క్రైమ్): మద్యానికి డబ్బులివ్వలేదని ఓ మనవడు తన తాతపై దాడి చేశాడు. గాయపడిన అతను ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. బుజబుజనెల్లూరు రాజులవీధికి చెందిన విశ్రాంత సీఐఎస్‌ఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ కృష్ణమూర్తి (68), వెంకటసుబ్బమ్మ దంపతులకు రవికుమార్, విజయలక్ష్మి, గీతారాణి సంతానం. అందరికీ వివాహాలయ్యాయి. వెంకటసుబ్బమ్మ కొంతకాలం క్రితం చనిపోయింది. కృష్ణమూర్తి వలంటరీ రిటైర్‌మెంట్ తీసుకుని అదే ప్రాంతంలో ఉంటున్న చిన్న కుమార్తె గీతారాణి వద్ద ఉంటున్నాడు. ఆమె తండ్రి బాగోగులు చూసుకుంటోంది. ఆమె కుమారుడు అనిల్‌సాయి మద్యానికి బానిసై తరచూ కృష్ణమూర్తిని డబ్బుల కోసం పీడించి తీసుకెళ్లేవాడు. బుధవారం రాత్రి మద్యం మత్తులో ఉన్న అనిల్‌సాయి మళ్లీ తాగేందుకు నగదు ఇవ్వాలంటూ తాతపై ఒత్తిడి చేసినా ఆయన ఇవ్వలేదు. ఈ క్రమంలో బయటకు వెళ్తున్న కృష్ణమూర్తిపై వెనుక నుంచి అనిల్‌సాయి దాడి చేశాడు. దీంతో ఆయన ముందుకు పడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన కుమార్తె, అల్లుడు, మరో మనవడు భాస్కర్‌సాయి కృష్ణమూర్తిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు సైతం అదే విషయాన్ని వెల్లడించడంతో తిరిగి జీజీహెచ్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం కృష్ణమూర్తి మృతిచెందారు. సమాచారం అందుకున్న కుమారుడు రవికుమార్ హాస్పిటల్‌కు చేరుకుని తండ్రి మృతదేహాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యాడు. తన తండ్రి మృతికి కారకుడిపై చర్యలు తీసుకోవాలని వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి	రూ.37
సన్నవి	రూ.27
పండ్లు	రూ.18

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) :	116
లేయర్ (లైవ్) :	85
బ్రాయిలర్ చికెన్ :	210
బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	234
లేయర్ చికెన్ :	145

అవగాహన పెంచుకోండి



డిజిటల్ అరెస్ట్ నుంచి దూరంగా ఉండేందుకు..

- సోషల్ మీడియాలో పోలీస్ శాఖ పోస్టులు

నెల్లూరు(క్రైమ్): ప్రజా చైతన్యంతోనే నేరాలు, ప్రమాదాలను కట్టడి చేయొచ్చని భావించిన ఎస్పీ జి.కృష్ణకాంత్ వినూత్న రీతిలో అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఇప్పటి వరకు ప్రజలతో నేరుగా మమేకమై నేరాలు, ప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుండగా తాజాగా సోషల్ మీడియా ద్వారా మరింత చైతన్యవంతులను చేసేందుకు చర్యలు చేపట్టారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ తదితరాలను వేదికగా చేసుకుని సైబర్ నేరగాళ్లు నేరాలకు పాల్పడుతున్నారు. సామాన్య ప్రజల నుంచి ప్రజాప్రతినిధుల వరకూ ఏ ఒక్కరినీ వదలకుండా అందిన కాడికి దోచేస్తున్నారు. వీటిని కట్టడి చేసేందుకు సైబర్ మోసాలు ఎలా జరుగుతాయి?, వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నేరానికి గురైతే ఎవరికి ఫిర్యాదు చేయాలి తదితర వివరాలతో పోస్టర్లను రూపొందించారు. ఇళ్లు విడిచి ఊర్లకు వెళ్లే సమయంలో స్థానిక పోలీసులకు తెలియజేయాలని, ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని, వాణిజ్య సముదాయాలు, విద్యాసంస్థలు, హాస్పిటల్స్, అపార్ట్‌మెంట్లు తదితర చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి, ఆపద సమయంలో 112 సేవలను వినియోగించుకోవాలంటూ పోస్టర్లు రూపొందించి వివిధ యాప్స్‌లోని అధికారిక ఖాతాల్లో పెట్టారు. ప్రజలు అవగాహన పెంచుకుని జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.



సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలంటూ..



మొబైల్ హంట్ సేవలపై..